క్లుప్తంగా

జనసేన జెండాలు, టీ షర్టులతో ఉన్న వాహనం సీజ్

కాకినాడ రూరల్: అనుమతి లేకుండా జెండాలు, టీ షర్టులతో వెళ్తున్న జనసేనకు చెందిన వాహనాన్ని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మంగళవారం గుర్తించి ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించడంతో వారు కేసు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల మేరకు కరప నుంచి జగన్నాథపురం వైపు వస్తున్న వాహనాన్ని తూరంగి వద్ద స్క్వాడ్ తనిఖీ చేశారు. కంగారు పడిన డ్రైవర్ వాహనాన్ని అక్కడ విడిచిపెట్టి పరారయ్యాడు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఇంద్రపాలెం పోలీసులకు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది జనసేన జెండాలు, టీ షర్టులు ఉన్న వాహనాన్ని అప్పగించారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.

ఏడు నామినేషన్ల దాఖలు

కాకినాడ: సిటీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఏడుగురు అభ్యర్థులు పదిసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా నామినేషన్లను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు అందజేశారు. యనమండ్ర లీలా సూర్యకిరణ్(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), వనమాడి వెంకటేశ్వరరావు (టీడీపీ), టేకుమూడి శ్రీనివాసరావు (స్వతంత్ర), మట్టా వెంకటేశ్వరరావు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), వినుకొండ వెంకటేశ్వరరావు (జాతీయ జనసేన పార్టీ), వాడ్రేవు సతీష్‌కుమార్ (స్వతంత్ర) ఒక్కొక్క సెట్ నామినేషన్ వేశారు. అలాగే చెక్కా నూకరాజు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) నాలుగు సెట్ల నామినేషన్లు వేశారు. మొత్తంగా మంగళవారం ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లు వేశారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా స్వతంత్రంగా పోటీ చేసేందుకు మడిపల్లి రాజు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో ఇట్ల రాజుకు స్వతంత్ర అభ్యర్థి మడిపల్లి రాజు ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

వైభవంగా తెప్పోత్సవం



కోనేరులో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన చిన్న పడవలో ఉంచి ఆలయ కోనేరులో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా కాల్చిన బాణసంచా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ కోనేరు భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

కాకినాడ సిటీ: కాకినాడ 24వ డివిజన్ ఇందిరా కాలనీకి చెందిన ఓ అనాథ మృతి చెందగా మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు. యాచకుడైన అతడు జగన్నాథపురం ప్రాంతంలో ఓ ఇంటి వద్ద సోమవారం రాత్రి నుంచి అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్‌కు తెలిపారు. ఆయన మృతి చెందిన వ్యక్తిని పరిశీలించి ఆయనే దగ్గరుండి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు

పెద్దాపురం: మండలంలోని అనధికార అక్రమ లే అవుట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు ఇదే అదునుగా చేసుకుని సుమారు మూడెకరాల స్థలంలో అనధికార లే అవుట్లు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన జగనన్న కాలనీకి ఇచ్చిన స్థలంలో సమీపంలో సీలింగ్‌కు సంబంధించిన సర్వే నెంబర్ 213లో ఎటువంటి అనుమతులు లేకండా ప్లాట్లుగా విడదీసి విక్రయాలు చేపట్టారు. సందట్లో సడేమియా అన్నట్టుగా ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉంటారనే ఉద్దేశంతో ఈ అక్రమ లే అవుట్‌లో ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా సంబంధింత వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని, అనధికార లే అవుట్‌లో బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

లబ్ధి పొందాం.. మద్దతిస్తాం

- వైఎస్సార్‌సీపీకి ఓటర్ల సంఘీభావం
- ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం
- ద్వారంపూడికి అపూర్వ స్వాగతం



కాకినాడ 26వ డివిజన్‌లో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఇంటి స్థలం ఇచ్చారు.. అమ్మఒడి పథకం మంజూరు చేశారు.. ఆరోగ్యశ్రీతో ఆదుకున్నారు.. డ్వాక్రా రుణాలు మాఫీ చేశారు.. మా జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారు.. మా మద్దతు మీకేనంటూ ఓటర్లు వైఎస్సార్ సీపీ నేతలకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం జగన్నాథపురం 26వ డివిజన్ కొవ్వూరు రోడ్డు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను స్వయంగా కలిసి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో పాటు తనకు కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆ సమయంలో అనేక నివాసాల వద్ద ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపించింది. ఓటు అభ్యర్థించడానికి ముందే ద్వారంపూడికి ఎదురెళ్లి మా మద్దతు మీకేనంటూ ఓటర్లు మద్దతుగా నిలిచారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని, అన్నీ ఇచ్చిన జగనన్నకే మా మద్దతు అంటూ సంఘీభావం ప్రకటించారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ హారతులిచ్చి ద్వారంపూడికి బ్రహ్మరథం పట్టారు. మరోసారి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలకు ఎల్లప్పుడు అండగా, తోడుగా ఉంటానని ద్వారంపూడి హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు సంగాని నందం, కొప్పనాతి బాబీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థుల భార్యలు బిందు, మహాలక్ష్మి ప్రచారం

స్థానిక 9వ డివిజన్ దుర్గానగర్, లక్ష్మీనగర్, 40 బిల్డింగ్స్ ప్రాంతాల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ సతీమణి బిందు, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ కార్పొరేటర్ కంపర బాబీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జరగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలంటూ వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగి ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగిన వారిద్దరిని ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు కార్యక్రమంలో వీరి వెంట ఉన్నారు.

ద్వారంపూడి కుమార్తెల ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని తండ్రికి మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు. 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతంలో డాక్టర్ ప్రణీత, 16వ డివిజన్ గోగుదానయ్యపేట, పిడుగులమ్మ తల్లి ఆలయ ప్రాంతాల్లో డాక్టర్ అంజని ఓటర్లను కలిసి తండ్రి ద్వారంపూడిని గెలిపించాలని అభ్యర్థించారు. 2019లో తాము ఎన్నికల ప్రచారం చేశామని, అప్పటికి, ఇప్పటికీ నగర రూపురేఖలు ఎంతో మారాయన్నారు. సుందరమైన రహదారులు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు, ఇళ్ల స్థలాలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని ప్రజలే ఎదురొచ్చి సంతోషంగా చెబుతున్నారన్నారు. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే చలమలశెట్టి, ద్వారంపూడిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ పేర్ల జోగారావు, బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో చలమలశెట్టి బిందు, ద్వారంపూడి మహాలక్ష్మి





ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని తదితరులు

ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు

- మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం
- తిమ్మాపురం ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు



తిమ్మాపురం ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాబోతోందని, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆ పార్టీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్, జేఎస్‌టీయూ వీసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీగా హాజరైన అభిమానుల నడుమ పాత పోలీసు స్టేషన్ ప్రాంతం నుంచి సాయంత్రం ప్రారంభించారు. ప్రచార వాహనంపై కన్నబాబు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగగా అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్‌లతో ర్యాలీగా పాల్గొన్నారు. గ్రామంలో అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా ప్రచారం చేపట్టగా మహిళలు దారి పొడవున హారతులు పట్టారు. యువకులు వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని జై జగన్, జై కన్నబాబు, జై బెజవాడ అంటూ నినదించారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో కన్నబాబు సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి భారీగా చేరారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ రూరల్‌లో తిమ్మాపురం అచ్చంపేట జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభకు వేలాదిగా జనాలు తరలివచ్చారన్నారు. తన నామినేషన్ పర్వంలోనూ అదే ఉత్సాహం కనబరిచారన్నారు. తిమ్మాపురం ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులమైన సునీల్, తనకు రెండు ఓట్లు వేయాలని కోరారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా సంక్షేమ పథకాలను పేదలకు నేరుగా సీఎం అందించి అవినీతి రహిత పాలనను అందించారన్నారు. పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల కోసం కూటమి కట్టి మభ్యపెట్టేందుకు వస్తున్నారని, ఆయనను నమ్మవద్దన్నారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు సింగిల్‌గా వస్తున్న జగన్‌ను చూసి భయపడుతున్నారన్నారు. కాకినాడ రూరల్‌లో జనసేన పోటీ చేస్తోందని, జనసేన కంటే జగన్ సేన బలమైనదని ఈ ఎన్నికల్లో నిరూపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బందిలి విరీష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం



అరట్లకట్ట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

కరప: అరట్లకట్టలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం ఎస్.విశేశ్వరరావు, ఉపాధ్యాయులు డి.సురేష్‌కుమార్, ప్రసాద్ బృందం ఆ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ క్విజ్, స్పెల్ బీ పోటీలు నిర్వహించారు. రెండు క్విజ్‌లలో 5వ తరగతి విద్యార్థిని ఎస్.శివపార్వతి విజేతగా నిలవగా సైన్స్ క్విజ్‌లో ఎ.శ్రావ్య, కె.రూప ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. స్పెల్ బీలో జి.అక్షయ, సీహెచ్ విజయలక్ష్మి, ఎస్.వెంకటేష్ సెకండ్, థర్డ్ బహుమతులు పొందారు. విజేతలకు రాజమహేంద్రవరం టైమ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పి.సాయికిరణ్, వి.రామమోహన్, జి.నాగేశ్వరరావు, కిశోర్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, సర్టిఫికెట్లు అందజేశారు.

ఓటు వినియోగంపై 'సెల్ఫీ పాయింట్'



సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఆర్వో వెంకటరావు

ప్రారంభించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: 'ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటా'... అన్న నినాదంతో ఓటర్లను చైతన్యవంతం చేసే దిశగా అధికారులు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఇందుకు సంబంధించిన ప్రచారబోర్డును సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ప్రారంభించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లతో పాటు ఓటు హక్కు ఉన్నప్పటికీ ఓటు వేసేందుకు నిరాసక్తత కనబరిచే ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా విస్తృత ప్రచారం చేస్తున్నామని ఆర్వో వెంకటరావు చెప్పారు. ఓటు హక్కు కలిగిన ఓటర్ల కోసం 'సెల్ఫీ పాయింట్' పేరుతో ఈ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. యువత చైతన్యవంతులై ఓటు విలువ, ప్రాధాన్యాన్ని అర్థం చేసుకుని కచ్చితంగా వచ్చే మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్వో వెంకటరావు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తోపాటు వివిధ విభాగాధిపతులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం


ప్రారంభించిన కమాండెంట్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమాండెంట్, ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ రూరల్: రమణయ్యపేట వద్ద ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో సిబ్బందికి మెడికవర్ ఆస్పత్రి, బాల ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యులు మంగళవారం ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలందించారు. శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రారంభించారు. బెటాలియన్ సిబ్బందికి ప్రతి నెలా వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి, పరిష్కరించుకోవచ్చన్నారు. సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కె.బాలకిరణ్, డాక్టరు ప్రత్యూష, డాక్టరు సునీల్, వైద్యాధికారి లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పులు చెరుగుతున్న భానుడు



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: రోహిణి కర్తర్లు ప్రారంభం కాకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. 26వ తేది వరకు పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో బంధుమిత్ర సపరివారంగా వెళ్లేందుకు హడలిపోతున్నారు. కల్యాణ మండపాలు దొరకని అనేక మంది ఇళ్ల వద్ద టెంట్లు వేసి భోజనాలు ఏర్పాటు చేయడంతో టెంట్ల నుంచి మరింత వేడి దిగి తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడం, వడగాడ్పులు వీయడంతో ప్రజలు అమల్లాడిపోయారు. మంగళవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మానుష్యంగా మారింది.

విద్యార్థులకు అభినందనలు

- తూరంగి జెడ్పీ విద్యార్థికి అత్యధిక మార్కులు
- 584 మార్కులు సాధించిన నాగసాయి అనూహ్య



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

కాకినాడ సిటీ: పదో తరగతి పరీక్షల్లో మండలంలోనే అత్యధిక మార్కులు సాధించి తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మంగవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అభినందించారు. తమ పాఠశాలలో 99 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఫస్ట్ క్లాస్‌లో 66 మంది, సెకండ్ క్లాస్‌లో 22 మంది, థర్డ్ క్లాస్‌లో 11 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం కడలి విజయదుర్గ తెలిపారు. వీరిలో అత్యధికంగా 584 మార్కులు సాధించి దాట్ల నాగసాయి అనూహ్య కాకినాడ రూరల్ మండలంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అదే విధంగా పడమట తన్మయ్ 575 మార్కులు, గుత్తుల సూర్యపవన్‌తేజ 574 మార్కులు సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ హెచ్‌ఎం ప్రత్యేక బహుమతులు అందజేశారు.

సంగీత సాహిత్యాల సమ్మేళనం నాటకం



నాటక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నటుడు మహ్మద్ షఫీ

బోట్‌క్లబ్: సంగీత సాహిత్యాల సమ్మేళనం నాటకమని ప్రముఖ నటుడు మహ్మద్ షఫీ అన్నారు. షేక్‌స్పియర్ జయంతి సందర్భంగా స్థానిక దంటు కళాక్షేత్రంలో మంగళవారం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్స్ ఆధ్వర్యంలో షేక్‌స్పియర్ రచించిన పలు నాటికలు ప్రదర్శించారు. ద మర్చంట్ ఆఫ్ వెన్నిస్, మషా అండ్ ది బేర్ ఇంగ్లీషు నాటికలు, అంధేరిన గర్ హిందీ నాటికలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నటనను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒకప్పుడు ప్రజలు వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకమన్నారు. నేటి కాలంలో నాటకానికి ప్రాధాన్యం తగ్గిపోతున్న తరుణంలో శ్రీప్రకాష్ యాజమాన్యం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి సాధించేందుకు తమ స్కూల్ కృషి చేస్తోందన్నారు. అనంతరం నాటికల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ శ్రీప్రకాష్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



పవమాన హోమం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్టు కాలనీలో వేంచేసిన రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో మంగళవారం నాడు పవమాన హోమం ఘనంగా జరిగింది. మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్వేష్ మాట్లాడుతూ ఉత్తరాది మఠ పీఠాధిపతుల సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించామన్నారు. మధ్వసభ కమిటీ సభ్యులు రాచూరి రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ దాసాంజనేయ స్వామి ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పవమాన హోమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మందిర నిర్వాహకులు యాతగిరి పరశురామ్, మధ్వసభ కమిటీ సభ్యులు టంకశాల శ్రీనివాసమూర్తి, బక్షి కేశవరావు, ఉదయగిరి శేషగిరిరావు, బారు గోవిందరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పాలమ్మతల్లి తీర్థం



కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి తీర్థం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో 15 రోజులు ముందు నుంచి అమ్మవారి గరగలను ఊరేగించారు. ఏటా చైత్ర పౌర్ణమి రోజున అమ్మవారి తీర్థాన్ని నిర్వహించడం పరిపాటి. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముసాలమ్మతల్లి తరపున సారె

వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి ఆలయంతో మంగళవారం పుట్టింటివారు పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతులు, సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్ దంపతులు, 150 మంది మహిళలు పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల స్వీట్లు, పండ్లు, సారెతో ఉప్పాలమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో సారె ఉంచి ఉప్పాలమ్మతల్లి ఆలయకమిటీ చైర్మన్ మురళీ కృష్ణ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అందజేశారు.